క్లుప్తంగా

నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాలె యాదయ్య హెచ్చరించారు. సోమవారం చించల్‌పేట వద్ద మూసీనదిపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించి, పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భవనాలు, రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణాల్లో నాణ్యత ఉండాలన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పీఆర్‌ఏఈ లక్ష్మయ్య, పీసీఎస్ వైస్ చైర్మన్ నర్సిహ్మారెడ్డి, నాయుకులు అనంత్ రెడ్డి, చిట్టయ్య తదితరులున్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజీనామా



మధుసూదన్‌రెడ్డి

మోమిన్‌పేట: భారతీయ జనతా పార్టీ వికారాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డిలకు రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు ఆయన చెప్పారు. పార్టీలో అంతర్గత పరిణామాల నేపథ్యంలో ఇముడలేక పోతున్నానని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. మధుసూదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

విద్యావ్యవస్థ ఉన్నతికి నిరంతరం కృషి

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



విద్యార్థులకు ఉచిత స్టడీమెటీరియల్ అందజేస్తున్న మనోహర్ రెడ్డి తదితరులు

దోమ: విద్యావ్యవస్థ ఉన్నతికి నిరంతరం కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుండాల్, దాదాపూర్, కిష్టాపూర్, దిర్సంపల్లి గ్రామాలలోని జెడ్పీ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీమెటీరియల్ అందజేసి మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుసూయ, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య, నాయకులు రాఘవేందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, శివకుమార్, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన



ఉత్సవంలో పాల్గొన్న శివ భక్తులు

కుల్కచర్ల: అయ్యప్ప స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా ముగిసింది. మల్లిఖార్జున సేవా సమితి ఆధ్వర్యంలో రెండురోజులుగా అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు.

గ్రామాల్లో వైద్య సేవలు భేష్

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్, వికారాబాద్ మా శారధ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యంతో పాటు చదువు, స్కాలర్‌షిప్ లాంటి విషయాల్లో ఎన్‌జీఓ సేవలు ఆదర్శనీయమన్నారు. అనంతరం ఎస్‌ఐ అరవింద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం శిబిరంలో ఏర్పాటు చేసిన సేవలను వారు పరిశీలించారు. శిబిరంలో 300 మందికి పైగా వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ పుష్పలీల, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి డాక్టర్ రాజేష్, వైద్యులు పూర్ణ, సందీప్, అభినవ్, ఆకాష్, దివాకర్‌రెడ్డి, అబ్దుల్లా, ప్రవీణ్, భార్గవి తదితరులు ఉన్నారు.

చిన్నారులపై చిన్నచూపు

- అంగన్‌వాడీలకు అందని ప్రథమ చికిత్స కిట్లు
- ఏడాది దాటినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న పిల్లలు, టీచర్లు



మమ్మదాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తును కొలుస్తున్న సిబ్బంది

నవాబుపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు సహజంగానే ఆరోగ్య పరంగా సున్నితంగా ఉంటారు. ఏ చిన్న గాయమైనా విలవిల్లాడుతారు. ఒకటి రెండు రోజులు వేధించే జలుబు, ఆటలాడు కుంటుంటే తగిలే దెబ్బలకు చీటికి మాటికి వైద్యుల వద్దకు తీసుకెల్లడం టీచర్లకు, ఆయాలకు అంత సులువు కాదు. వీటిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి ప్రాథమిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రథమ చికిత్స అందించాలనే నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రానికి పది రకాల మందులు, పిల్లల పొడువు లెక్కతీయడానికి కొలమానిని, బరువు తూకం వేయడానికి ఆధునిక పరకరాన్ని అందజేసింది. మందుల పేర్లు వాటిని ఎప్పుడు ఏమోతాదులో వినియోగించాలో చిన్న పుస్తకంలో పొందుపరిచారు.

అందని ఔషధాలు

చిన్న పిల్లల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న ప్రథమ చికిత్స మందుల పెట్టెలు ఏడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కావడంలేదు. ఏడాది క్రితం ఇచ్చిన ప్రథమ చికత్స మందులు మెజారిటీ కేంద్రాల్లో ఎప్పుడో అయిపోయాయి. దాంతో పిల్లలకు ఏ చిన్న గాయమైనా ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలు కేంద్రాల టీచర్లు, తల్లిదండ్రులు చెబుతున్నారు. పంపిణీ చేయాల్సిన ప్రథమ చికిత్స మందులు ఏడాది దాటినా సరఫరా చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ.. అధికారులు పట్టించుకోకపోవడంపై పిల్లల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిచి తక్షణమే మందులు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. వికారాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో (వికారాబాద్, నవాబుపేట, పూడూర్, దారూర్) 233 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 7,489 మంది, 3 సంవత్సరాల నుంచి 6 ఏళ్ల లోపు వారు 3,404 మంది, గర్భిణీలు 1155, బాలింతలు 138 మంది ఉండగా 226 అంగన్‌వాడీ టీచర్లు, 219 ఆయాలు పని చేస్తున్నారు.

సరఫరా కాలేదు



చిన్న పిల్లల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రథమ చికిత్స మందుల పెట్టెలను సరఫరా చేస్తుంది. సరఫరా చేసి సంవత్సరం దాటింది. చాలా కేంద్రాల్లో మందులు అయిపోయినట్లు టీచర్లు తమ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారులకు నివేదించాం. రాగానే కేంద్రాలకు సరఫరా చేస్తాం.

– వెంకటేశ్వరమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, వికారాబాద్

పంపిణీ చేసే మందులు..

పారాసిటమల్ 500మి. ఒంటి నొప్పులు, తలనొప్పి కండరాల నొప్పితో చిన్నారులు బాధపడుతుంటే ఈ మాత్ర వినియోగంచవచ్చు. పారాసిటమల్ ద్రావకం: జలుబు, తలనొప్పి, ఫ్లూ తదితర అనారోగ్య సమస్యలకు వినియోగించవచ్చు. అల్బెండజోల్ 100మి.గ్రా: కడుపునొప్పి, ప్రధానంగా పరాన్నజీవి పురుగులు, నులి పురుగులతో బాధపడుతున్న వారికి వాడవచ్చు. ప్రొవైడిన్ ఐయోడిన్ ఆయిట్‌మెంట్: దీర్ఘకాలంగా వేధిస్తున్న గాయాలు, పుండ్లు, దద్దుర్లు గాయాల నివారణకు వాడతారు. అబ్జార్‌బెంట్ దూది: చిన్నచిన్న గాయాలు, పుండ్లను శుభ్రం చేసి, మందు పూసేముందు దూదితో శుభ్రం చేస్తారు. ఇంకా కాటక్ బ్యాండేజ్, సిరప్‌లు, రకరకాల ఔషధాలు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఏడాది గడిచినా సరఫరా కావడం లేదని అంగన్‌వాడీలు చెబుతుండగా.., అధికారులు స్పందించి పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్వతీమాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న పురోహితులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీనగరేశ్వర స్వామివారి ఆలయంలో పార్వతీదేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం సభ్యులు, పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం 6.05గంటలకు ఆలయ ద్వారా పూజలు, 7గంటలకు గణపతి పూజ, పుణ్యహవాచనం, వరుణీ కలశ స్థాపన, వాస్తు హోమం, నవగ్రహ హోమం, బలిహరణ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నగరేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, పార్వతీదేవి అమ్మవారికి అభిషేకం, రుద్రహవనం, అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేద పండితులు మంత్రోచ్చారణలతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం



కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

మోమిన్‌పేట: నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులు వారం రోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మోమిన్‌పేటలో ఆర్‌అండ్‌బి రోడ్డును రెండు కిలో మీటర్ల మేర రూ.10కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించే పనులు నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం, 800మీటరుల సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి మిగతా పనులను నిలిపివేశారు. మండల ప్రజల ఒత్తిడి మేరకు తిరిగి రెండేళ్ల తర్వాత పనులు పునఃప్రారంభించారు. బీటి, 100మీటరుల సీసీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. డివైడర్ మధ్యలో సెంటర్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు వెడల్పు పనులు పూర్తైన వెంటనే మండల పరిషత్ ఆధ్వర్యంలో దుకాణ సముదాయాలను నిర్మించనున్నారు. అందుకు గాను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి రూ.20లక్షల నిధులను కేటాయించేందుకు గతంలో హామీ ఇచ్చారు. దీంతో దుకాణ సముదాయాలను నిర్మిస్తే మండల పరిషత్‌కు సమకూరనుంది. గతంలో రోడ్డు పక్కన డబ్బాలు వేసుకొని చిరు వ్యాపారం చేసుకొనేవారికి దుకాణాలను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

‘కంటి చూపును కాపాడుకోండి’

యాలాల: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రునాయక్ అన్నారు. సోమవారం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అన్ని అవయవాల్లో కళ్లు నేత్రాలు ఎంతో ప్రధానమని, వాటిని సంరక్షించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. కంటి పరీక్షలు చేయించుకొని, అవసరమైన విధంగా చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

విశేష స్పందన

బంట్వారం: కంటివెలుగుకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎంపీడీఓ బాలయ్య అన్నారు. నాగవరం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రజలు పూర్తి స్థాయిలో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షలు చేయించుకుని కంటి సమస్యల నుంచి దూరం కావాలంటూ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ వందన, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఎంపీహెచ్ఓ ఐలయ్య, ఆప్తమాలజిస్టు నవీన్ ,స్థానిక ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉషారాణి అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. కంటి చూపు లోపించినవారు ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి హాజరై తమ కళ్లను పరీక్షించుకోవాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహింకునేవారు తమ ఆధార్‌కార్డును వెంట తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ రాజు, సిబ్బంది నాగరాజు, ఆర్‌పీలు వెంకటయ్య, ఆనందమ్మ, అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతగిరి: కంటివెలుగు శిబిరాన్ని సందర్శించిన జెడ్పీచైర్‌పర్సన్

అనంతగిరిలో..

అనంతగిరి: కంటివెలుగును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. ఈమేరకు ఆమె వికారాబాద్ మండలంలోని సిద్దులూర్ గ్రామంలో జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సందర్శించారు. ఆమె వెంట ఎంపీపీ చంద్రకళ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వడ్ల నందు, సర్పంచు ఆంజనేయులు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

పనిచేసేవారిని మండలికి పంపండి

ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న భుజంగరావు

తాండూరు టౌన్: ఉపాధ్యాయుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీలు సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా ప్రభుత్వ భజనపరులుగా మారడం సిగ్గుచేటని మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎస్టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు ఆరోపించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి భంగం కలిగించేలా డబ్బులు ఎరచూపి ఓట్లు వేయించుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా, ప్రభుత్వానికి వత్తాసు పాడుతూ, ధనార్జనే ధ్యేయంగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను ఓడించాలని, స్వలాభాపేక్ష లేకుండా, విద్యారంగాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లడంలో భాగంగా బరిలో దిగిన తనకు ఓటు వేసి గెలిపించి, శాసనమండలికి పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, బసిరెడ్డి, షఫీ, విష్ణు, అంజిలయ్య, శ్రీనివాసరావు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కుల్కచర్ల: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని పటేల్ చెరువుతండా సర్పంచ్ శాంతిబాయి తులసిరాం అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం పటేల్ చెరువు తండా జీపీ పరిధిలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆటలతో బహుముఖ ప్రయోజనాలు ఉంటాయన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ.. నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని, పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని సూచించారు. పోటీల్లో భాగంగా పటేల్ చెరువుతండా మొదటిస్థానంలో నిలవగా.. ద్వితీయ స్థానంలో ఘనాపూర్ తండా నిలిచింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతో అన్నివర్గాలకు మేలు

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


బషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంఅమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు అన్నారు. సోమవారం బషీరాబాద్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, పేద కుటుంబాల తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్లిళ్లకు ఇబ్బంది పడకుండా షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను అమలు చేస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

గిడ్డంగుల నిర్మాణానికి శంకుస్థాపన

వ్యవసాయ సహకార సంఘానికి మంజూరయిన రూ.2కోట్లు నాబార్డు నిధులతో గిడ్డంగుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాఘవరెడ్డి, నాయకులు ఇందర్‌చెడ్ రాజు, పాండురంగారెడ్డి, రాముునాయక్ తదితరులున్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: మతాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణలో అధికారంలోకి రావడం కోసం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ శక్తులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని, అధికార దాహంతో ప్రజాస్వామాన్ని కాలరాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య విమర్శించారు. దళిత, గిరిజన ప్రజాస్వామ్యవాదులపై దాడులకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్వేచ్ఛా జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తూ చట్టాలను చేతుల్లోకి తీసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అంబేడ్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులపై మతోన్మాదులు దాడులకు పాల్పడం సరికాదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం.. మౌనంగా ఉండడం మంచిదికాదన్నారు. ఎవరైనా చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించినా, మాట్లాడినా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య, వెంకటయ్య, శేఖర్, లాలయ్య, రాంచంద్రయ్య, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరోచిత పోరాట యోధుడు నేతాజీ



తాండూరు: నేతాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కుల్కచర్లలో వ్యాసరచన పోటీలు

- యువత స్ఫూర్తి కెరటం సుభాష్ చంద్రబోస్
- ఆయన సేవలు చిరస్మరణీయం
- బోస్ జయంతిలో వక్తలు

యాలాల: దేశ ప్రజల స్ఫూర్తి కెరటం నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా అతిథి గృహ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో యువతకు ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని గుర్తు చేశారు. అలుపెరగని పోరాటంతో, ఓటమి ఎరుగని నాయకుడిగా దేశానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు నేతాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ పుష్పలీల, ఎస్‌ఐ అరవింద్‌కుమార్, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, ఆర్‌ఐ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

జాతీయభావాలను పెంపొందించుకోవాలి

కుల్కచర్ల: సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకుసాగాలని జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య అన్నారు. సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు

పరిగి: దేశ ప్రజలను బ్రిటీష్ వారి బాని సంకెళ్ల నుంచి విముక్తి చేయడంతో సుభాష్‌చంద్రబోస్ పోరాటం ఎంతో కీలకమని మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్ తెలిపారు. చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని పలు కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ నాకు మీరక్తాన్ని ఇవ్వండి.. మీకు నేను దేశాన్ని ఇస్తాననే నినాదాన్ని ప్రజల్లో తీసుకువచ్చి, సైన్యాన్ని ఏర్పర్చుకున్నారన్నారని, ఆయన చేసిన సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. వీరోచిత పోరాటంతోనే దేశానికి స్వాతంత్ర్యం సాధ్యమైందని నాటి బ్రిటీష్ ప్రభుత్వమే ప్రకటించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై విఠల్‌రెడ్డి, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల నివాళి..

తాండూరు టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు తాండూరు పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక నేతాజీ కూడలి వద్ద గల ఆయన విగ్రహానికి పలు పార్టీలు, సంఘాలు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఏబీవీపీ, తపస్, పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



యాలాలలో..



పరిగిలో మాట్లాడుతున్న ఎస్సై విఠల్‌రెడ్డి



కొడంగల్ రూరల్..
విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మర్పల్లి: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొంషెట్‌పల్లి ప్రాజెక్టు మత్స్యకారుల సంఘం నూతన అధ్యక్షుడు మన్నే వెంకటేశం అన్నారు. సోమవారం మత్స్యకారుల నూతనంగా సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మన్నే వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా తెలుగు రాజు, కార్యదర్శిగా మన్నే రాజు, కోశాధికారిగా కొలుపల్లి మల్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేశం మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఏటా ప్రాజెక్టులో ఉచితంగా చేపపిల్లలను వదులుతుందని, తద్వారా మత్స్యకారుల వృత్తి పరంగా వృద్ధి చెందారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్ సేవలు మరువలేనివి

తాండూరు రూరల్: చైల్డ్‌లైన్ తాండూరు డివిజన్ కోఆర్డినేటర్, సామాజిక వేత్త దివంగత ఎర్ర వెంకటేశ్ సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం వీర్‌శెట్టిపల్లి గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి.. వెంకటేశ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం వెంకటేశ్ తల్లి ఎంపీటీసీ నర్సమ్మ, సోదరుడు శ్రీనివాస్‌లను ఓదార్చారు. మృతుడి భార్య పద్మకు ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వెంకటేశ్ బాల కార్మికుల విముక్తి, బాల్య వివాహాల నిర్మూళలనకు ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. కార్యక్రమంలో ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, మాజీ సర్పంచు నర్సింహులు, గని కార్మికసంఘం డైరెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.